కృత్రిమ వృషణాలు

పురుషుల్లో వంధ్యత్వానికి చెక్ పెట్టేందుకే • తొలిసారిగా అభివృద్ధి చేసిన పరిశోధకులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): పురుషుల్లో వంధ్యత్వానికి చెక్ పెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ప్రయోగశాలల్లో కృత్రిమ వృషణాలను అభివృద్ధి చేయడంలో ఇజ్రాయెల్‌కు చెందిన బార్-ఇలాన్ యూనివర్సిటీ పరిశోధకులు విజయవంతమయ్యారు. ఎలుకల వృషణాల్లోని కొన్ని కణాలను తీసుకొని అభివృద్ధి చేసిన ఈ కృత్రిమ వృషణాలు 9 వారాలపాటు మెరుగైన పనితీరును చూపించాయని పరిశోధకులు తెలిపారు. టెస్టోస్టిరాన్ హార్మోన్, శుక్రకణాల ఉత్పత్తి, నిల్వ, విడుదల తదితర చర్యలను ఎలాంటి ఆటంకం లేకుండా ఈ వృషణాలు పూర్తి చేశాయన్నారు.

ప్రయోగ ఉద్దేశమిదే!

మనుషుల మూల కణాలను సేకరించి వాటి సాయంతో కూడా కృత్రిమ వృషణాలను అభివృద్ధి చేస్తామని పరిశోధకులు తెలిపారు. తద్వారా వంధ్యత్వానికి చెక్ పెట్టేలా తదుపరి తమ ప్రయోగాలు ఉండనున్నట్టు వెల్లడించారు. శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉండటం, వాటిలో చురుకైన కదలికలు లేకపోవడంతోనే పురుషుల్లో సంతానానికి అవరోధం ఏర్పడుతున్నట్టు ఇప్పటివరకూ ఫర్టిలిటీ క్లినిక్‌లు చెప్పగలుగుతున్నాయని, అయితే, శుక్రకణాలు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాయి? ఆ సమస్యకు పరిష్కారం ఏమిటన్నదే తమ ప్రయోగ ఉద్దేశమని వాళ్లు వివరించారు. ఈ వివరాలు 'బయోలాజికల్ సైన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

నియాసిన్‌తో గుండెకు ముప్పు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): నియాసిన్ (విటమిన్-బీలో రకం)ను అధిక మోతాదులో తీసుకొంటే గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదమున్నదని అమెరికా పరిశోధకుల తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. రక్తనాళాల్లో వాపునకు, నాళాలు దెబ్బతినడానికి ఇది కారణమవుతున్నట్టు వివరించింది. విటమిన్-బీ లోపం ఉన్నవారు మాంసం, చేపల ద్వారా నియాసిన్‌ను తీసుకొంటారు. మరికొందరు నియాసిన్‌ను డ్రగ్స్ (ఔషధం) ద్వారా కూడా తీసుకొంటారు. అయితే, డ్రగ్స్‌ను వాడేవారు వైద్యుల సూచన మేరకు తగినంత మోతాదులోనే తీసుకోవాలని పరిశోధకులు సూచించారు. ఈ వివరాలు 'నేచర్ మెడిసన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ప్రాణకోటికి 20 డిగ్రీలు చాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): భూమిపై నివసించే సకల జీవరాశికి ఎంతటి ఉష్ణోగ్రత అవసరమన్న దానిపై ఏండ్లకేండ్లుగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నో అధ్యయనాల తర్వాత తాజాగా పరిశోధకులు దీనిపై ఓ నిర్ధారణకు వచ్చారు. ప్రాణకోటికి 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత చాలని తేల్చిచెప్పారు. నార్వే, టాస్మానియా, కెనడా, స్కాట్లాండ్, జర్మనీ, హాంకాంగ్, తైవాన్‌కు చెందిన నిపుణుల ప్రకారం.. మనుషులతో పాటు గాలి, నీటిలో నివసించే వివిధ రకాల జంతువులు, మొక్కలు, సూక్ష్మజీవుల వంటి ఇతర జీవజాలాలకు 20 డిగ్రీల ఉష్ణోగ్రత సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. 20 డిగ్రీల సెల్సియస్ వంటి కనీస ఉష్ణోగ్రత పరిసరాల్లో ఉంటే ఎక్కువ వేడిమిని ఉత్పత్తి చేసే అవసరం శరీరానికి అంతగా అవసరపడదు. దీంతో జీవుల శక్తి, సామర్థ్యాలు వృథా కాబోవని పరిశోధకులు వివరించారు.

మెదడు సంకేతాల్ని చదివే స్మార్ట్‌బ్యాండ్

కాలిఫోర్నియా, ఫిబ్రవరి 21: మెదడు సంకేతాల్ని చదివే ఒక స్మార్ట్‌బ్యాండ్‌ను తీసుకొస్తున్నట్టు ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించారు. మనిషి మెదడులో కంప్యూటర్ చిప్‌ను అమర్చామన్న అమెరికా బిలియనీర్ ఎలాన్ మస్క్ ప్రకటన.. ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చింది. తన చుట్టూ ఉండే సాంకేతిక పరికరాల్ని (కంప్యూటర్, మొబైల్..) నియంత్రించేందుకు ఎలాన్ మస్క్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు మూలం 'న్యూరాల్ టెక్నాలజీ'. నాడీ సంకేతాలను అర్థం చేసుకునే కంప్యూటర్ సాంకేతికత ఇది. జుకర్‌బర్గ్ కూడా పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తూ 'న్యూరాల్ టెక్నాలజీ' ప్రాజెక్ట్‌ను చేపట్టారు. ఆధునిక టెక్నాలజీతో మనిషి మెదడును అనుసంధానం చేసే 'ఎలక్ట్రోమయోగ్రఫీ' బ్యాండ్‌ను మరికొద్ది సంవత్సరాల్లో మార్కెట్లోకి విడుదల చేస్తామన్నారు.

'ఢిల్లీ చలో' మార్చ్ ఉద్రిక్తం

రైతులపై టియర్‌గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు

- తలకు గాయాలతో యువరైతు మృతి
- రెండు రోజుల పాటు మార్చ్ నిలిపివేత
- 23న భవిష్యత్తు కార్యాచరణ
- ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం.. భారీ ట్రాఫిక్
- మరో దఫా చర్చలకు కేంద్రం ఆహ్వానం

బుధవారం శంభు (హర్యానా-పంజాబ్) సరిహద్దు వద్ద రైతులపై టియర్‌గ్యాస్‌ను ప్రయోగిస్తున్న పోలీసు బలగాలు

చండీగఢ్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతులు 'ఢిల్లీ చలో' మార్చ్‌ను బుధవారం ఉదయం తిరిగి ప్రారంభించిన క్రమంలో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ఖనౌరి సరిహద్దు వద్ద ఘర్షణల్లో ఒక యువ రైతు మరణించాడు. ఈ క్రమంలో మార్చ్‌ను రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు రైతు నేతలు ప్రకటించారు. పరిస్థితిని సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణపై శుక్రవారం సాయంత్రం నిర్ణయాన్ని వెలువరిస్తామని రైతు నేత శర్వాన్ సింగ్ బుధవారం సాయంత్రం పేర్కొన్నారు. అయితే శంభు, ఖనౌరి సరిహద్దుల్లో ఆందోళన కొనసాగుతుందని తెలిపారు. ఎంఎస్పీ విషయంలో కేంద్రం చేసిన 'ఐదేండ్ల ఒప్పందం' ప్రతిపాదనను తిరస్కరించిన రైతులు 'ఢిల్లీ చలో' ఆందోళనను బుధవారం ఉదయం 11 గంటలకు తిరిగి ప్రారంభించారు. శంభు, ఖనౌరి సరిహద్దుల నుంచి ఢిల్లీ వైపుగా సాగేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులను అడ్డుకొనేందుకు పోలీసులు రెండు ప్రాంతాల్లో పలు రౌండ్ల బాష్పవాయువు ప్రయోగించారు.

12 మంది పోలీసులకు గాయాలు

ఘర్షణల్లో 12 మంది పోలీసు సిబ్బంది గాయపడ్డారని హర్యానా పోలీసులు వెల్లడించారు. భద్రతా సిబ్బందిని చుట్టుముట్టిన ఆందోళనకారులు.. పంట వ్యర్థాలను తగలబెట్టి, అందులో కారం పొడి వేశారని ఆరోపించారు. శంభు, ఖనౌరి సరిహద్దుల వద్ద పోలీసులు అడ్డుకోవడంతో రైతులు తమ ట్రాక్టర్ ట్రాలీలు, మినీ వ్యాన్లు, ఇతర వాహనాలతో నిలిచిపోయారు. వీటితోపాటుగా ఆందోళన ప్రాంతాల్లో ఎర్త్ మూవర్లు, పొక్లెయిన్లు, జేసీబీలు మాడిఫైడ్ ట్రాక్టర్లు కూడా కనిపించాయి. వీటితో రైతులు బారికేడ్లను ధ్వంసం చేసేందుకు అవకాశం ఉన్నదని, భద్రతా సిబ్బందికి హాని కలుగుతుందని హర్యానా పోలీసులు పేర్కొన్నారు. మిషనరీని సంబంధిత యజమానులు వెనక్కు తీసుకుపోవాలని, లేకుంటే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

ఢిల్లీ మార్చ్‌కు అనుమతివ్వాలి

శంభు సరిహద్దు వద్ద రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ మాట్లాడుతూ ఉద్యయం విజయం సాధించాలంటే శాంతియుతంగా ఉండాలని రైతులకు పిలుపునిచ్చారు. ఆందోళనను దెబ్బతీసే అంశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు. ఢిల్లీ మార్చ్ శాంతియుతంగానే సాగుతుందని, శాంతికి విఘాతం కలిగించే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. కేంద్రం ఎంఎస్పీపై చట్టం చేస్తే ఆందోళనలు ఉండవని అన్నారు. రైతులు ఢిల్లీకి మార్చ్ చేపట్టేందుకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు.

మరోసారి చర్చలకు రండి

కేంద్రం మరోసారి రైతులను చర్చలకు ఆహ్వానించింది. ఆందోళనకారులు శాంతియుతంగా ఉండాలని, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్న కేంద్ర మంత్రి అర్జున్ ముండా.. ఎంఎస్పీతో సహా ఇతర అంశాలపై ఐదో దఫా చర్చలకు రైతులను ఆహ్వానిస్తున్నట్టు బుధవారం వెల్లడించారు. పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లపై చర్చించే విషయంలో దేశవ్యాప్తంగా ఉన్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొంటామని పేర్కొన్నారు.

భద్రత కట్టుదిట్టం.. నిలిచిన ట్రాఫిక్

మార్చ్‌ను బుధవారం తిరిగి ప్రారంభిస్తున్నట్టు రైతులు ప్రకటించిన నేపథ్యంలో ఆందోళకారులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా ఢిల్లీ, గుర్‌గ్రామ్ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల రోడ్లను బ్లాక్ చేశారు. దీంతో ఢిల్లీ-గుర్‌గ్రామ్ హైవే, ఢిల్లీ-బహదూర్‌గఢ్, రాజోక్రి, సర్హోల్ సరిహద్దుల్లో బుధవారం ఉదయం భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. మరోవైపు టిక్రి, సింఘూ, ఘాజీపూర్ సరిహద్దుల్లో ఢిల్లీ పోలీసులు భద్రతను పెంచారు. నిరంతరం నిఘా ఉంచాలని ఉన్నతాధికారులు సిబ్బందిని ఆదేశించారు.

యూపీలో రైతుల ఆందోళనలు

మరోవైపు ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో యూపీలోని ముజఫర్‌నగర్, మీరట్, ఘజియాబాద్ సహా పలు జిల్లాల్లో రైతులు బుధవారం ఆందోళనలు చేపట్టారు. కలెక్టరేట్లకు మార్చ్ చేపట్టారు. మీరట్ పోలీసుల అడ్డంకులను తొలగించుకొని రైతులు కలెక్టరేట్‌కు చేరుకొన్నారని మరో బీకేయూ నేత అనురాగ్ చౌదరి తెలిపారు. ఎస్కేఎం పిలుపు మేరకు భగ్‌పట్‌లో కూడా రైతులు జిల్లా కేంద్రానికి ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు.

ఆత్మాహుతికి రైతు యత్నం

ముజఫర్‌నగర్‌లో బ్రిజ్‌పాల్ అనే రైతు ఆత్మాహుతికి యత్నించాడు. సకాలంలో మంటలను ఆర్పివేసిన తోటి రైతులు వెంటనే అతన్ని స్థానిక దవాఖానకు తరలించారు. ముఖంపై స్వల్పంగా కాలిన గాయాలయ్యాయని సిటీ మేజిస్ట్రేట్ వికాశ్ కశ్యప్ తెలిపారు. రైతు బ్రిజ్‌పాల్‌కు రుణ సంబంధిత సమస్య ఉన్నదని, దాన్ని త్వరలో పరిష్కరిస్తామన్నారు. అయితే బీకేయూ జిల్లా అధ్యక్షుడు యోగేశ్ శర్మ మాట్లాడుతూ బ్రిజ్‌పాల్ ఎలాంటి రుణం తీసుకోలేదని, అయినప్పటికీ బ్యాంకు నుంచి నోటీసులు రావడంతో ఆందోళనకు గురయ్యాడని పేర్కొన్నారు. తన సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో బ్రిజ్‌పాల్ ఆత్మహత్యకు యత్నించారని అన్నారు.

గ్రామాల్లోకి రాజకీయ నేతల్ని రానివ్వం..

ఢిల్లీకి మార్చ్ చేపట్టేందుకు కేంద్రం రైతులను అనుమతించకుంటే.. రైతులు కూడా ఎన్నికల ప్రచారానికి వచ్చే రాజకీయ నాయకులను తమ గ్రామాల్లోకి రానివ్వకుండా నిషేధిస్తారని బీకేయూ నేత రాకేశ్ టికాయిత్ అన్నారు. 'రైతుల మార్చ్‌ను అడ్డుకొనేందుకు రోడ్లపై ఇనుప మేకులు పెట్టడం సరికాదు. వారు అలా చేస్తే.. మేం కూడా గ్రామాల్లో ఆదే చేస్తాం. మా గ్రామాలకు రానివ్వకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తాం' అని హెచ్చరించారు.

రేడియో ప్రెజెంటర్ అమీన్ సయానీ ఇకలేరు

ముంబై: 'నమస్కార్ భాయ్‌యోం ఔర్ బెహ్నో, మై ఆప్కా దోస్త్ అమీన్ సయానీ బోల్ రహా హూ' అంటూ రేడియో ప్రియుల్ని అలరించిన గొంతు మూగబోయింది. దేశంలో కోట్లాది మందిని ఆకర్షించిన రేడియో ప్రెజెంటర్ సయానీ ముంబైలోని ఓ దవాఖానలో మంగళవారం రాత్రి కన్నుమూశారు. 91 ఏండ్ల సయానీకి గుండెపోటు రావటంతో దక్షిణ ముంబైలోని హెచ్ఎన్ రిలయన్స్ దవాఖానకు తరలించామని, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని ఆయన కుమారుడు రజిల్ సయానీ చెప్పారు. సయానీ మృతిపట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. అమీన్ సయానీ 50వేలకు పైగా రేడియో కార్యక్రమాలు నిర్వహించి రేడియో మ్యాస్ట్రోగా పేరు తెచ్చుకున్నారు.

యూపీలో కాంగ్రెస్‌కు 17 సీట్లు

ఎస్పీతో కుదిరిన పొత్తు

లక్నో, ఫిబ్రవరి 21: యూపీలోని సీట్లపై ఇండియా కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ పార్టీల మధ్య ఎట్టకేలకు పొత్తు కుదిరింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో యూపీలోని మొత్తం 80 సీట్లలో కాంగ్రెస్‌కు 17 సీట్లు కేటాయిస్తూ ఒప్పందం కుదరినట్టు ఇరు పార్టీలు బుధవారం ప్రకటించాయి. రాష్ట్రంలోని 17 సీట్లలో కాంగ్రెస్ బరిలోకి దిగుతుందని, మిగిలిన 63 స్థానాలలో ఎస్పీ, దాని మిత్రపక్ష పార్టీలు పోటీలో ఉంటాయని ఎస్పీ రాష్ట్ర చీఫ్ నరేష్ ఉత్తమ్ పటేల్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ రాజ్ సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు.

ప్రసవానికి ఆక్యుపంక్చర్ వైద్యం.. తల్లీబిడ్డల మృతి

తిరువనంతపురం: భర్త వైఖరి వల్ల భార్య, నవజాత శిశువు ప్రాణాలు కోల్పోయిన సంఘటన కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. మూడు సార్లు సిజేరియన్ ద్వారా బిడ్డలకు జన్మనిచ్చిన తన భార్య షెమీరా బీబీ (36) నాలుగోసారి సాధారణ ప్రసవం ద్వారా బిడ్డకు జన్మనివ్వాలని భర్త నయాజ్ కోరుకున్నారు. దీని కోసం ఆయన తన భార్యకు ఓ ఆక్యుపంక్చర్ వైద్య నిపుణుడి వద్ద చికిత్స చేయించారు. తొమ్మిది నెలలు నిండటంతో మంగళవారం ఆమెకు పురుటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆమెను సమీపంలోని దవాఖానకి తీసుకెళ్లగా, ఆమెతో పాటు ఆమెకు జన్మించిన బిడ్డ కూడా మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఆమె గర్భిణిగా ఉన్న కాలంలో ఆశా వర్కర్లు వారి ఇంటికి వెళ్లినప్పటికీ, ఆమెతో మాట్లాడటానికి నయాజ్ అనుమతించేవాడు కాదు. ఇరుగుపొరుగు వారితో కూడా మాట్లాడనిచ్చేవాడు కాదు. నయాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డయాబెటిస్‌కు రెడ్‌లైట్ థెరపీ!

బ్లడ్ షుగర్ స్థాయిలు 28 శాతం నియంత్రణ

లండన్, ఫిబ్రవరి 21: రెడ్ లైట్ థెరపీతో (ఎరుపు రంగు కాంతి) డయాబెటిస్‌ను ని యంత్రణలోకి తీసుకురావొచ్చని, దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. భోజనం చేశాక మన శరీరంపై కొన్ని నిమిషాలపాటు (15 నుంచి 45 నిమిషాలు) ఎరుపు రంగు కాంతి (670 నానోమీటర్ల పరిధి) పడేట్టు చేస్తే.. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు 28 శాతం తగ్గే అవకాశముందని, తద్వారా శరీరంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి వస్తాయని యూనివర్సిటీ ఆఫ్ లండన్ పరిశోధకులు తేల్చారు. పరిశోధనకు నేతృత్వం వహించిన డాక్టర్ మైఖేల్ పానర్ మాట్లాడుతూ, 'శరీరంపై ఎరుపు రంగు కాంతి పడగానే.. జీవకణంలోని మైటోకాండ్రియా యాక్టివ్ అవుతుంది. వెంటనే శక్తిని ఉత్పత్తి చేయటం మొదలుపెడుతుంది. భోజనం చేసిన తర్వాత గ్లూకోజ్ స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా ఇది అడ్డుకుంటుంది' అని అన్నారు. ఎల్ఈడీ లైట్లలో నీలిరంగు (బ్లూ లైట్) కాంతి ఆరోగ్యానికి హాని చేస్తుందన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఎల్ఈడీ లైట్లనే వాడుతున్నందున ఈ ముప్పును గుర్తించాలన్నారు.

చెరకు ఎఫ్ఆర్‌పీ రూ.25 పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: 2024-25 సీజన్‌లో చెరకు ఎఫ్ఆర్‌పీని(చెరకు రైతులకు మిల్లులు చెల్లించే కనీస ధర) క్వింటాల్‌కు రూ.25 పెంచేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో క్వింటాల్‌కు ఎఫ్ఆర్‌పీ రూ.340కి చేరింది. సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటకలో ప్రధానంగా చెరకు పండిస్తారు. మరోవైపు, ఉపగ్రహాల భాగాల తయారీలో వంద శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించటం ద్వారా అంతరిక్ష రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను ప్రభుత్వం బుధవారం సడలించింది.

ఉప్పుడు బియ్యం ఎగుమతులపై

సుంకం కొనసాగింపు

న్యూఢిల్లీ: ఉప్పుడు బియ్యం ఎగుమతులపై విధిస్తున్న 20 శాతం సుంకాన్ని మార్చి 31 తర్వాత కూడా కొనసాగిస్తామని కేంద్రం బుధవారం స్పష్టం చేసింది. దేశీయ అవసరాలకు సరిపడేలా నిల్వలను ఉంచేందుకు ప్రభుత్వం పారాబాయిల్డ్ రైస్ ఎగుమతులపై 2023 అక్టోబర్ 16 వరకు 20 శాతం సుంకాన్ని విధిస్తూ అదే ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత దానిని ఈ ఏడాది మార్చి 31 వరకు పొడిగించింది. అయితే మార్చి 31 తర్వాత కూడా ఈ సుంకం కొనసాగుతుందని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ కొనసాగింపు ఎప్పటివరకో వెల్లడించ లేదు.

గగన్‌యాన్ ఇంజిన్ సిద్ధం

- రోదసిలోకి మనుషులను పంపే క్రయోజనిక్ ఇంజిన్ రెడీ
- ఇస్రో కీలక ముందడుగు



బెంగళూరు, ఫిబ్రవరి 21: అంతరిక్షంలోకి మనుషులను పంపేందుకు ఇస్రో మరో ముందడుగు వేసింది. గగన్‌యాన్ మిషన్‌లో వినియోగించే ఎల్వీఎం-3 లాంచ్ వెహికల్ సీఈ20 క్రయోజెనిక్ ఇంజిన్ రెడీ అయ్యిందని ప్రకటించింది. 'ఎల్వీఎం-3 రాకెట్‌కు శక్తినిచ్చే సీఈ20 క్రయోజెనిక్ ఇంజిన్ హ్యూమన్ రేటింగ్‌లో ప్రధాన మైలురాయిని సాధించింది' అని పేర్కొన్నది. ఈ ఇంజిన్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు అనేక భద్రత చర్యలు తీసుకున్నట్టు వెల్లడించింది. ఈ నెల 13న చివరి దశ ప్రమాణ పరీక్షలు పూర్తయ్యాయని వివరించింది. గగన్‌యాన్‌లో మిషన్‌లో భాగంగా ఇస్రో ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది. దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి, తిరిగి భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రయోగంలో.. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై దిగుతారు. రాకెట్ ఇంజిన్లలో హ్యూమన్ రేటింగ్ వ్యవస్థ కీలకం. మానవులు సురక్షితంగా ప్రయాణించేందుకు యంత్రాలు ఏ మేరకు సరిపోతాయని ఈ వ్యవస్థ అంచనా వేస్తుంది. 2025లో ఈ మిషన్‌ను చేపట్టే లక్ష్యంతో ఇస్రో చర్యలు ముమ్మరం చేసింది. ఈ మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగోదేశంగా భారత్ నిలుస్తుంది. ఈ మిషన్‌ను 2025లో చేపట్టాలని భావిస్తున్నది. వాస్తవానికి 2022లోనే పాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చింది.

పొడవు వ్యక్తితో పొట్టి మహిళ!

ప్రపంచంలోనే అతి పొడవైన వ్యక్తి సుల్తాన్ కోసెన్(8 అడుగుల 2.8 అంగుళాలు), పొట్టి మహిళ జ్యోతి ఆమ్గే(2 అడుగుల 0.75 అంగుళాలు) అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన ఓ కార్యక్రమంలో సందడి చేశారు. తుర్కియేకు చెందిన సుల్తాన్, భారత్‌కు చెందిన జ్యోతి ఒక ప్రాజెక్టుపై చర్చించేందుకు కలిసినట్టు సమాచారం. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో జన్మించిన జ్యోతి ఆమ్గే ఇటీవలనే 30వ జన్మదినాన్ని జరుపుకొన్నారు.

తాడుకు సెలైన్ కట్టి..

మహారాష్ట్రలోని బుల్దానా జిల్లా సోమధాన గ్రామంలో కలుషిత ప్రసాదం తిని 300 మంది భక్తులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని సమీపంలోని దవాఖానకు తరలించగా.. చికిత్స అందించేందుకు అక్కడ సరిపడా బెడ్లు, సెలైన్ స్టాండ్లు లేవు. దీంతో దవాఖాన వెలుపల ఆరుబయట స్థలంలోనే రెండు చెట్ల మధ్య ఒక పెద్ద తాడు కట్టి.. దానికి ఇలా సెలైన్ సీసాలను వేలాడదీసి రోగులకు చికిత్స చేశారు.

పెండ్లి సాకుతో ఉద్యోగంలోంచి తప్పించటం వివక్షే!

న్యూఢిల్లీ: వివాహాన్ని సాకుగా చూపి మహిళా ఉద్యోగిని సర్వీస్ నుంచి తొలగించటం వివక్షాపూరితమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. లింగ వివక్ష చూపే ఏ చట్టమైనా రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. బాధితురాలికి 60 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఆర్మీలో నర్స్‌గా పనిచేస్తున్న సెలీనాజాన్ వివాహం చేసుకుందన్న కారణంగా 1988లో ప్రభుత్వం ఉద్యోగం నుంచి తొలగించింది. దీనిపై బాధితురాలు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ట్రిబ్యునల్‌ను సంప్రదించాల్సిందిగా హైకోర్టు సూచించింది. దీంతో సెలీనా సాయుధ దళాల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. కేసు విచారించిన ట్రిబ్యునల్ ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తీర్పునిచ్చింది. దీనిని సవాల్ చేస్తూ కేంద్రం సుప్రీంకు వెళ్లడంతో తాజా తీర్పు వెలువడింది.

రోబోలతో ఫుడ్ డెలివరీ

జపాన్‌లో వచ్చే నెల నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ రోబోల వినియోగం పెరుగుతున్నది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ ఉబెర్ ఈట్స్ వచ్చే నెల నుంచి జపాన్‌లోని టోక్యోలో రోబోలతో ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించనున్నది. ఇందుకోసం మిత్సుబిషి ఎలక్ట్రిక్ అండ్ కార్ట్‌కెన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అటానమస్ సైడ్‌వాక్ రోబోలను కార్ట్‌కెన్‌కు చెందిన మోడల్ సీ నిర్వహిస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో రోబోలతో ఫుడ్ డెలివరీ చేయించడం ఇదే తొలిసారి కానుంది. నిజానికి జపాన్‌లో రోబోల వాడకం కొత్తేమీ కాదు. ఏళ్ల తరబడి ఇక్కడి రెస్టారెంట్లలో ఇవి సేవలు అందిస్తూనే ఉన్నాయి. అయితే, ఇప్పుడివి వీధుల్లో ఫుడ్ డెలివరీ చేస్తూ కనిపించడమే కొత్త వింత కాబోతున్నది. ఫుడ్ డెలివరీ చేసే ఈ రోబోలు పాదచారులు నడిచే దారినే ఎంచుకుంటాయి. ట్రాఫిక్ సిగ్నళ్లను పాటిస్తాయి. అయితే, ఇవి నడుచుకుంటూ వెళ్లి ఫుడ్ డెలివరీ చేస్తే పుణ్యకాలం కాస్తా గడిచిపోయి ఆహారం చల్లారిపోదా? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఈ సమస్యకు పరిష్కారంగా కార్గోబిన్‌ను డిజైన్ చేస్తున్నట్టు సమాచారం. వీటిలో ఆహారం సరఫరా చేస్తే అప్పుడు వండినట్టుగానే ఉంటుందట!

వామ్మో.. వాయిస్ క్లోనింగ్!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

ఏఐ సాయంతో కృత్రిమంగా ఫేక్ వాయిస్ సృష్టి

'ఆపదలో ఉన్నాం! డబ్బు లు పంపించాలం'టూ మనం చేస్తున్నట్టు నకిలీ వాయిస్‌తో ఆప్తులకు ఫోన్

కొత్త కుట్రలకు తెరలేపుతున్న సైబర్ నేరగాళ్లు

అమెరికా, ఐరోపాలో పలు కేసులు నమోదు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): డీప్‌ఫేక్ వీడియోల కలకలం ఒకవైపు కొనసాగుతుండగానే వాయిస్ క్లోనింగ్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే అమెరికా, ఐరోపా దేశాల్లో ఈ తరహా కేసులు నమోదయ్యాయి. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో నకిలీ వాయిస్‌ను సృష్టించడమే 'వాయిస్ క్లోనింగ్'గా నిపుణులు చెప్తున్నారు. నకిలీ వాయిస్‌తో ఆర్థిక నేరాలకు పాల్పడటమే దీని ఉద్దేశమని వెల్లడిస్తున్నారు.

ఎలా మభ్యపెడతారు?

లక్షిత వ్యక్తికి సంబంధించిన వాయిస్‌ను తొలుత ఏఐ సాయంతో ట్రైన్ (తర్ఫీదునిచ్చి) చేసి అసలు వాయిస్‌గా భ్రమించేలా క్లోనింగ్ చేస్తారు. తర్వాత సదరు వ్యక్తికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఆప్తుల ఫోన్ నంబర్లకు కాల్స్ చేసి ఆ వ్యక్తి మాట్లాడినట్టుగా ఫేక్ సంభాషణను కొనసాగిస్తారు. 'ఆపదలో ఉన్నాం. వెంటనే ఈ నంబర్‌కు డబ్బులు పంపించా'లంటూ విజ్ఞప్తి చేస్తారు. డబ్బులు పంపించే వరకూ పలు విధాలుగా మభ్యపెడతారు. ఆత్మీయులే ఫోన్ చేశారు కదా అంటూ అలా పలువురు పెద్దమొత్తంలో డబ్బు పంపించిన ఉదంతాలు అమెరికాతో పాటు ఇప్పటికే పలు దేశాల్లో వెలుగుచూశాయి కూడా. అమెరికాలోని ఓ కంపెనీకి చెందిన సీఈవో ఇలా మోసపోయే ఏకంగా 2.43 లక్షల డాలర్లను నేరగాళ్లకు పంపించినట్టు సమాచారం. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు కూడా వాయిస్ క్లోనిం